# భాగం 6. శైలి - రచనా భేదాలు

విషయక్రమం

6.0 ఉద్దేశం
6.1 ప్రవేశిక
6.2 శైలి నిర్వచనం
అభ్యాసాలు చేయండి 1
6.3 శైలీ భేదాల ప్రయోజనం
అభ్యాసాలు చేయండి 2
6.4 రచనలో అవసరమైన కొన్నిశైలీ భేదాలు
6.4.1 విస్తరణశైలి × సంక్షిప్తశైలి
ఆకళింపు ప్రశ్నలు
6.4.2 సాధారణశైలి × ఉద్వేగశైలి
అభ్యాసాలు చేయండి 3
6.4.3 సాధారణశైలి × కవితాత్మక శైలి
అభ్యాసాలు చేయండి 4
6.4.4 శైలిలో సూటిదనం, పదును
ఆకళింపు ప్రశ్నలు
6.4.5 ఆత్మీయతాశైలి, ఆబ్జెక్టివ్ శైలి
అభ్యాసాలు చేయండి 5
6.4.6 గ్రాంధిక శైలి
అభ్యాసాలు చేయండి 6
6.5 ముఖ్య విషయాలను గుర్తు చేసుకొందాం
అభ్యాసాలకు మాదిరి జవాబులు

## 6.0 ఉద్దేశం

రాయదలచుకున్న విషయాన్ని బట్టీ, సందర్భాన్ని బట్టీ, అభిరుచిని బట్టీ రచనా పద్ధతి అంటే శైలి ఏ రకంగా మారుతుందో ఈ విభాగంలో పరిశీలించగలుగుతారు. శైలీ భేదాల వల్ల కలిగే రచనా ప్రయోజనాన్ని గుర్తించ గలగటమే కాక, రచనలో అవసరమైన కొన్ని శైలీ భేదాలను విశ్లేషించగలుగుతారు. రచనావసరాలను బట్టి మంచి శైలిని అలవరచుకోగలుగుతారు.

## 6.1 ప్రవేశిక

రచన చేసేటప్పుడు మనం భాషను వాడుకునే శక్తినీ, శైలి అంటారు. భాషను వాడుకోవడం ఒక నేర్పు, ఒక ప్రత్యేకత. ఒక అవసరం కూడా. భాషా ప్రయోగ నైపుణ్యం, రచనా విధానం అనే మాటలతో కూడా శైలిని సూచిస్తారు. శైలి అనేది మనం రాయదలచుకున్న విషయం మీదా, సందర్భం మీదా, అభిరుచి మీదా మనం ఉద్దేశించిన పాఠకుల మీదా ఆధారపడి ఉంటుంది. శైలి అంటే ఏమిటో, శైలీభేదాలవల్ల ప్రయోజనం ఏమిటో, మనం రచన చేసేటప్పుడు గుర్తించుకోవలసిన కొన్ని శైలీ భేదాలు ఏవో ఈ భాగంలో చర్చించుకుందాం. మిగతా భాగాలలో మాదిరి కాకుండా ఈ విభాగంలో 6.4 విభాగంలోని ఆయా ఉప విభాగాలకింద అభ్యాసాలు ఇచ్చాం. ఈ భాగంలోని విషయానికున్న ప్రాధాన్యాన్ని మీకు తెల్పడానికి ఈ పద్ధతి అవసర మనుకున్నాం.

## 6.2 శైలి నిర్వచనం

భాషను ప్రయోగించే పద్ధతి చెప్పే విషయాన్నిబట్టీ, వాడే వారినిబట్టీ, సందర్భాన్నిబట్టీ వేరుగా ఉంటుంది. ఈ భేదాలు ఉపయోగించే మాటల్లోనూ, పదబంధాల్లోనూ, వాక్యాల్లోనూ ఉంటాయి. వీటిని శైలీ భేదాలు అంటారు. మాట్లాడే భాషలో మాండలిక భేదాలు మనం నిత్యం గమనిస్తున్నవే. తీరాంధ్రులు (కోస్తా, తెలంగాణావారు, రాయలసీమ వారు మాట్లాడేటప్పుడు ఉపయోగించే క్రియా పదాల్లోనూ, సంధిలోనూ, వాక్య నిర్మాణంలోనూ మనం ఈ భేదాలను గమనించగలం. ఉదాహరణకు రాయలసీమవారు **'వచ్చినాడు'** అని తెలంగాణావారు **'వచ్చిండు'** అని, అంటే తీరాంధ్రులు **'వచ్చాడు'** అని అంటారు. ఈ రకమైన భేదాలు స్పష్టంగా కనిపించేది. ఇవికాక ఒక్కోవ్యక్తికి ఒక్కోరకంగా మాట్లాడే అలవాటు ఉంటుంది రాసే అలవాటు ఉంటుంది. ఈ అలవాట్ల సమూహాన్ని కూడా శైలీభేదాలనే అంటారు.
రాసే భాషలో ఇంతకుముందు చెప్పినట్టుగా వస్తువును బట్టీ, సందర్భాన్ని బట్టేకాక రాసేవారి అభిరుచినిబట్టి కూడా శైలీ భేదాలుంటాయి. భాషా సర్వస్వంలో రచయిత తానెన్నుకున్న భేదాల సమూహాన్ని రచనా భాషలో శైలిఅనినిర్వచించవచ్చు. భాషా ప్రయోజనం ప్రధానంగా విషయ నివేదనమే అయినప్పటికీ, నివేదించే పద్ధతుల్లో వచ్చేభేదమే శైలీ భేదం.

**అభ్యాసాలు చేయండి 1**

I) కింది వాక్యాల్లో ప్రధాన అర్థం ఏమిటి? శైలీభేదాలు ఏమిటో గుర్తించండి.

సంజయ్‌గాంధీ మరణించాడు
సంజయ్‌గాంధీ స్వర్గస్థుడయ్యాడు.
సంజయ్‌గాంధీ చనిపోయాడు.
ఉదయ భానుడు అస్తమించాడు.

........................................................................................................
........................................................................................................
........................................................................................................
........................................................................................................

II) శైలీ భేదాలు ఎట్లా ఏర్పడతాయో 50 పదాల్లో తెల్పండి.

........................................................................................................
........................................................................................................
........................................................................................................
........................................................................................................
........................................................................................................
........................................................................................................
........................................................................................................
........................................................................................................
........................................................................................................

## 6.3 శైలీ భేదాల ప్రయోజనం

ఒక విషయాన్ని చెప్పటానికి ఒకమార్గం సరిపోతుంది కదా! మరి ఈ భేదాలెందుకు? అనే ప్రశ్న రావచ్చు. ఈ భేదాలు భాషను వ్యవహరించే వారికి అనవసరమైన శ్రమా బరువూ అని కూడ అనిపించవచ్చు. మానవుల ఆలోచనలూ ప్రవర్తనలూ, పలుకుబడులూ మూసలో పోసినట్టుగా ఒకేరకంగా ఉండవు. అట్లా ఒకే రకంగా చెప్పటం కానీ, రాయటంకానీ యాంత్రికమైన పద్ధతి. మనుషులకు నూత్న కల్పనల మీదా, వైవిధ్యంమీదా ఉన్న ఆసక్తికి ఈ శైలీ భేదాలు చిహ్నాలు. ఇవి భాషా ప్రయోగంలో విసుగుదల (monotony) ను పోగొట్టి, శ్రోతలకూ, పాఠకులకు ఆసక్తి దాయకంగా ఉంటాయి.

భాషా పరిశోధకులు ఈ శైలీ భేదాలను వివరంగా పరిశీలించి వాటిని అధ్యయనం చేస్తున్నారు. ఈ రకపు కృషి మాట్లాడే భాషమీద ఎక్కువగా జరిగింది. ఈ పాఠ్యాంశం ప్రధాన ప్రయోజనం

ఈనాటి తెలుగు పద్ధతులను పరిచయం చేయడం బట్టి రచనలో శైలీ భేదాలనే ప్రధానంగా గమనిద్దాం. రాసేభాష మూలాలనూ మాట్లాడే భాషా భేదాలనూ ఇక్కడ విస్తారంగా చెప్పటం లేదు. ఇంతకు పూర్వం వాక్యభేదాలను చర్చించినపుడు సంబంధబోధక వాక్య పద్ధతులు మూడున్నాయని, ఈ మూడూ చెప్పేవిషయం ఒకటయినా, ఈ మూడు పద్ధతులు వాడే సందర్భాలు వేరనీ గుర్తించాం. అట్లాగే కర్తప్రధాన వాక్యాలు కర్మప్రధాన వాక్యాలు, క్రియా ప్రధాన వాక్యాలు ఒకే విషయాన్ని చెబుతున్నాయనీ మనం వాక్యంలో ఒకో పదానికిచ్చే ప్రాధాన్యాన్ని బట్టి ఈ భేదాలు ఏర్పడ్డాయనీ, వీటిని వాడే పద్ధతులు వేరని చెప్పుకున్నాం. అవికూడా శైలీ భేదాలే.

**అభ్యాసాలు చేయండి 2.**

కింది సంభాషణ ఎందుకు అసందర్భంగా ఉందో వివరించండి.
"అమ్మాయ్! నీ తెలుగు పుస్తకం కనపడటం లేదే?
"అది స్కూల్లో దొంగిలించబడింది"
"నువ్వు అన్నం, ఇప్పుడు తింటావా? ఇంకాసేపు ఆగి తింటావా?
"ఇంకొక అరగంట ఆగి తినటం జరుగుతుంది"

---

## 6.4 రచనలో అవసరమైన కొన్ని శైలీ భేదాలు

ఏదైనా రాసేటప్పుడు మనం ఏవిషయం మీదరాస్తున్నాం? ఎందుకోసం రాస్తున్నాం ఎవరికోసం రాస్తున్నాం ఏ విధానంలో రాస్తే మనం ఉద్దేశించింది చదివేవాళ్ళకు అందుతుంది అని తప్పక ఆలోచిస్తాం. ఈ ఆలోచనే రచనలో శైలీ భేదాలకు దారి తీస్తుంది.

### 6.4.1 విస్తరణ శైలి × సంక్షిప్త శైలి

ఒక విషయాన్ని చెప్పేటప్పుడు అవతలివాళ్లకి అర్థం కావటంకోసం బాగా విస్తరించి చెప్పటాన్ని విస్తరణశైలి అంటారు. ఈ విస్తరణశైలిలో అవతలి వాళ్ళకు చాలా విషయాలు తెలిసిఉండవు అనే భావన అంతర్గర్భితంగా ఉంటుంది. ఇందులో అప్పుడప్పుడు కానీ తరచుగా కానీ చెప్ప దల్చుకున్న ప్రధాన విషయానికి సంబంధించిన వాక్యాలకు వివరణ ప్రాయమైన వాక్యాలు అనుబంధంగా ఉంటాయి. ఉదాహరణకు ఈ కింది పేరాను చదవండి:

"మన రాజ్యాంగంలో కొన్ని ప్రాథమిక హక్కులున్నాయి. రాజ్యాంగం అంటే దేశ పౌరులు, తమని తాము పరిపాలించుకునే ప్రవర్తన నియమావళి అని అంటారు. కాని ఇది ఒక వర్గం ఇంకో వర్గాన్ని దోచుకోవటానికి ఏర్పరచుకొన్న యంత్రాంగమని మార్క్సిస్టులంటారు. పౌరులంటే దేశ నిర్మాణంలో భాగస్వాములైన వ్యక్తులు. ఈ పౌరులకు కొన్ని హక్కులుంటాయి. వీటిని 'పౌర హక్కులు' అంటారు."

దీన్ని క్లుప్తంగా చెప్పాలంటే "**భారతదేశ రాజ్యాంగంలో పౌరులకు కొన్ని హక్కులున్నాయి**" అనవచ్చు.

మొదటిది విస్తరణశైలికీ, రెండోది సంక్షిప్తశైలికీ ఉదాహరణలన్నది స్పష్టమే. ఇక్కడ గుర్తించకోవలసింది రెంటికీ ఉన్న ప్రయోజన భేదాలు.ఏదో ఒకశైలి ఎప్పుడూ పనికొస్తుందని చెప్పలేం. ఈ రెంటిమధ్య భేదం తెలుసుకుంటే అవసరాన్ని బట్టి వాడుకోవచ్చు. ముఖ్యంగా పత్రికా రచనలో ఉన్న స్థలాన్నిబట్టి ఎంత క్లుప్తంగా రాయాలో ఎంత విశదంగా రాయాలో నిర్ణయించుకోవాల్సి ఉంటుంది.

**ఆకళింపు ప్రశ్నలు**

i) **1987 అక్టోబరు 18 ఈనాడు** ఆదివారం సంచికలో వచ్చిన ప్రత్యేకవ్యాసంలో ఉన్న ఈ పేరాను ఇంతకన్న క్లుప్తంగా రాయడానికి ప్రయత్నించండి.

"......ఇప్పుడు వున్న సంఘనియమాల ప్రకారం ఒక 'పెళ్ళి' జరిగేటప్పుడు పురుషుడికి స్త్రీ 'కట్నం' పేరుతో డబ్బూ, ఇతర కానుకలూ ఇవ్వవలసి వస్తోంది. ఇది ఎందుకు జరుగుతోందంటే 'సంఘంలో స్త్రీలూ, పురుషులూ 'సమానులుగా లేకపోవడం' వల్ల. స్త్రీలూ, పురుషులూ 'సమానంగా లేకపోవడం' వల్ల. స్త్రీలూ, పురుషులూ 'సమానంగా లేకపోవడం' ఎందుకు జరుగుతోందంటే స్త్రీలు 'పోషణ' కోసమూ, 'రక్షణ' కోసమూ, ఇతర సాంఘిక అంశాలలో గుర్తింపుల కోసమూ పురుషులమీద ఆధారపడి ఉండవలసిన పరిస్థితులవల్ల. ఈ పరిస్థితులు ఎందుకు వున్నాయంటే సంఘంలో 'స్వంత ఆస్తి విధానం' వుండడంవల్ల".

..................................................................................................................

..................................................................................................................

..................................................................................................................

..................................................................................................................

..................................................................................................................

..................................................................................................................

..................................................................................................................

ii) అదే వ్యాసంనుంచి తీసుకున్న ఈ కింది రెండు వాక్యాలను విస్తరించి రాయండి.

"పెట్టుబడిదారీ విధానం తప్పనిసరిగా నిరుద్యోగాన్ని వృద్ధిచేస్తుంది. మార్కెట్లను విలాస వస్తువులతో నింపేస్తుంది. ఇంకా అనేక దుర్లక్షణాలకు కారణమవుతుంది".

..................................................................................................................

..................................................................................................................

..................................................................................................................

..................................................................................................................

## 6.4.2. సాధారణ శైలి × ఉద్వేగ శైలి

చెప్పదలచుకున్న భావాన్ని సూటిగా, స్పష్టంగా చెప్పేది సాధారణశైలి. అట్లాకాకుండా ఆవేశంతో కానీ ఆవేదనతోకాని కవితాత్మకంగా చెపితే ఉద్వేగశైలి అంటాం. ఈ ఉద్వేగశైలి చాలాసార్లు రాసేవారి మనఃస్థితిని తెలియజేస్తుంది. సాధారణంగా ఒక అనుకోని అపాయమో ప్రమాదమో జరిగినపుడు ఆ అసాధారణ స్థితి తెలియజేయడానికి ఈ శైలి వాడుతుంటారు. ఉదాహరణకు రాజస్థాన్‌లో రూప్ కన్వార్ అనే పద్ధెనిమిదేళ్ల యువతి 1987 సెప్టెంబర్ 4 న, భర్తతోపాటు చితికెక్కి దహనమై పోయిన విషయాన్ని ప్రస్తావిస్తూ **ఆంధ్రజ్యోతి** దినపత్రిక సెప్టెంబర్ 15 తేదీన ప్రచురించిన ఒక వ్యాసంలో ఈ పేరా ఉంది:

"కాలగర్భంలో కలిసిపోతున్న ఒక అమానుషమైన సంప్రదాయానికి ఊపిరిపోసిన జైపూర్ గ్రామం సిగ్గుతో తలదించుకోవడానికి బదులు ఆనందోత్సాహంతో కేరింతలు వేస్తోంది. ముక్కుపచ్చలారని పద్ధెనిమిదేళ్ల రూపకన్వార్ ప్రాణాలను నిలువునా కాల్చుకుతిన్న ఆ స్థలం నేడు 'సతీ స్థలంగా' మారి వేలాదిమంది ప్రజల పూజలందుకుంటోంది. ఇది ఎక్కడో, ఎప్పుడో జరిగింది కాదు. రాజస్థాన్ రాజధాని జైపూర్‌కు 80 కిలోమీటర్ల దూరంలో ఈ నెల నాలుగోతేదీన నాలుగువేలమంది 'నాగరికుల' మధ్య జరిగింది ఈ సంఘటన".

ఈ పైన ముందు వర్ణన, తరువాత వార్త ఉంది. ఆ వార్త పైభాగం ఒక కథలాగ మొదలవుతుంది. ఇందులో ఉపయోగించిన **అమానుష, ముక్కుపచ్చలారని, కాల్చుకుతిన్న** వంటి విశేషణాలు ఈ రచనకు ఉద్వేగాన్ని కలిగిస్తున్నాయి. **'సతీస్థలం' 'నాగరికులు'** అనే మాటలకు అమర్చిన కొటేషన్ మార్కులు ఆ మాటలు వ్యక్తంచేసే భావనలకు రచయిత నిరసన, హేళన సూచిస్తున్నాయి. ఇంకా ఈ వాక్యాల్లో ఉపయోగించిన పదజాలంకూడా ఇట్లా ఆవేశాన్ని వ్యక్తంచెయ్యటానికి తగినట్లుగా ఉన్నాయి. అందువల్ల ఈ వాక్యాలు మామూలు వచనస్థాయి నుంచి ఎదిగి సాహిత్య స్థాయి నందుకున్నాయి.

ఈ రకపు వచనం రాయటానికి తగిన పదాలూ, విశేషణాలూ ఎన్నుకునే నేర్పు అవసరం.

**అభ్యాసాలు చేయండి 3**

1987 సెప్టెంబర్ 18 న ఈనాడు దినపత్రికలో అచ్చయిన ఈ వార్తను చదివి ఇందులో ఉద్వేగానికి సహాయపడ్డ అంశాలను గుర్తించండి.

"బుధవారం అర్ధరాత్రి నగరం నడిబొడ్డులోని మహిళా హాస్టల్లో ఓ యువతిని కత్తులతో పొడిచి రెండు గంటలసేపు బీభత్సం సృష్టించి దుండగులు పారిపోగలిగారు. రక్షించమని కోరుతూ ఆ యువతి చేసిన ఆర్తనాదాలు ప్రక్కగదుల్లోని యువతుల గుండెలను గుభేలుమనిపించాయి. భయంతో వారు చిక్కచచ్చిపోయారు.

..........................................................................................................................

..........................................................................................................................

..........................................................................................................................

..........................................................................................................................

..........................................................................................................................

## 6.4.3 సాధారణశైలి × కవితాత్మకశైలి

ఈ పైన ముందరి ఉపవిభాగంలో (6.4.2) చర్చించిన ఉద్వేగశైలిలో కూడా కవితాత్మకత ఉన్నప్పటికీ ఆ రకపుశైలి ఆవేదనను వ్యక్తం చెయ్యటానికి మాత్రమే పనికొస్తుంది. అట్లాకాక మనసుకు ఉల్లాసాన్నీ సంతోషాన్నీ ఉత్సాహాన్నీ కలిగించే శైలిని కవితాత్మక శైలిగా ఇక్కడ ఉద్దేశిస్తున్నాం. ఉదాహరణకు "కాశ్మీర దీపకళిక" అనే పుస్తకంలో కాశ్మీర ప్రాంతంలోని "ఊలర్" సరస్సును చూసి ఉత్సాహంతో రాసిన ఈ వచనం చూడండి:

"వెండిరేకు నొకదాన్ని భూమి ఉపరితలాన మిక్కిలి నేర్పుతో తాపడం చేసినట్లున్న ఆ సరస్సు నిస్తరంగంగా స్తబ్ధంగా శోభిస్తోంది. ఆకాశంమీద ఫిచ్చలవిడిగా పరచుకున్న మబ్బుముక్కలు తెల్లవీ, నీలివీ రకరకాల ఆకారాలు కలిగి ఆ నీళ్లలో ప్రతిఫలిస్తున్నాయ్. వెండిరేకుమీద నీలాలూ ముత్యాలూ పొదిగినట్లు అందాలు చిందిస్తోంది సరస్సు. దూరంగా కొండల వరుస వాటి అంచుల చివళ్ళు నీళ్లలో కరిగి వాటిమీద గుండుసూదులు గుచ్చినట్లుగా భ్రమ కలిగిస్తున్న పైన్‌చెట్ల ఆకారాలు కూడా ప్రతిఫలించి నిటారుగా వసుంధరా వక్షస్థలం మీద నిలువవలసిన పర్వతం దన్నుతప్పి సరస్సులోకి ఒరిగిన భ్రమకలిగిస్తోంది".

పై వచనంలో రచయిత్రి ప్రకృతిశోభకు పారవశ్యం చెందిన పద్ధతి కనిపిస్తుంది.

తరంగాలు లేని, చలనంలేని ఆ సరస్సు (పదిహేను మైళ్లవెడల్పు) భూమిపైభాగాన వెండిరేకు నొకదాన్ని చాలానేర్పుతో తాపడం చేసినట్లున్నదని రచయిత్రి వర్ణించారు. ఊహకు మాత్రమే అందే పోలికయిది. చుట్టూ ఉన్న పైన్ చెట్లు వెండి రేకుమీద కొట్టిన మేకుల్లాగా ఉన్నాయని వర్ణించారు. ఇట్లా పోలికల ద్వారా సాహిత్య స్థాయి నందుకున్న వచనమిది.

సాహిత్య స్థాయిని అందుకున్న వచనాలను ఇంకా చాలా రకాలను అనుభవాన్ని బట్టి గుర్తించవచ్చు. సాహిత్యేతరమైన వచనాల్లో కూడా కొన్ని రకాల శైలీ భేదాలను, వాటి ప్రయోజనాలను గుర్తించవచ్చు.

**అభ్యాసాలు చేయండి 4**

ఈ క్రింది ఉదహరించిన వచనంలో సాహిత్య స్థాయికి అనుకూలించిన అంశాలను గుర్తు పట్టండి. ఇది దేవులపల్లి కృష్ణశాస్త్రి కందుకూరి రాజ్యలక్ష్మమ్మ మీద రాసిన వ్యాసంలోది.

"నా దృష్టిలో వెలుగుంటే, నా మనస్సులో విజ్ఞానం ఉంటే, నా హృదయంలో స్వచ్ఛత ఉంటే, హేమంత నిశీధంలో వాసంత ప్రభాతంచూడగల విశ్వాసమే ఉంటే ఆ చిన్న కపాలాలలో, ఆ స్విన్న నేత్రాలలో, ఆ జీర్ణవసనంలో నా శరీరాన్ని తన చేతుల్లో లాగే, నా జీవితాన్ని తన ప్రేమతో శుభ్రసుందరంగా కడిగిన మాతృమూర్తిని చూడగలిగి ఉందును కదా!"

..........................................................................................................................

..........................................................................................................................

..........................................................................................................................

..........................................................................................................................

..........................................................................................................................

### 6.4.4 శైలిలో నూటిదనం, పదును

ఈ రకపు శైలిలో చెప్పదలచుకున్న విషయాన్ని నిర్మొహమాటంగా, సూటిగా, చురుగ్గా, స్పష్టంగా చెప్పే పద్ధతి కనిపిస్తుంది. ఉదాహరణకు రాచమల్లు రామచంద్రారెడ్డి గారి ఈ వాక్యాలు చూడండి.

**"ఈ సాహిత్య వర్తకానికి తెలుగు రేడియో ఒక విధేయమైన పరిచారిక, సాహిత్య అకాడమీ ఒక విశ్వాసపాత్రమైన అంగరక్షక దళం."**

ఈ శైలినే లాగుడుశైలిగా మార్చదలచుకుంటే ఈ విధంగా రాయవచ్చు:
**"ఈ సాహిత్య వర్తకానికి తెలుగు రేడియో ఒక విధేయమైన పరిచారికలాగా కనిపిస్తుంది. సాహిత్య అకాడమీ ఒక విశ్వాసపాత్రమైన అంగరక్షక దళంలాగా నాకు అనిపిస్తోంది."**

**కనిపిస్తోంది, అనిపిస్తోంది** అనే మాటలు చేర్చడం వలన శైలిలో పదును ఏ విధంగా పోయిందో గుర్తుపట్టవచ్చు. నిశ్చయాత్మకంగా చెప్పవలసినచోట జారుడు పద్ధతిలో **కనిపిస్తుంది, అనిపిస్తుంది** అని చెప్పటం వలన ఈ మార్పు కలుగుతున్నది.

## అభ్యాసాలు చేయండి 5

### ఆకళింపు ప్రశ్నలు

ఈ కింది పదునైనశైలిని మీరు స్వంతంగా రాసే శైలిలోకి మార్చి భేదాన్ని పరిశీలించండి.

"సాహిత్యం వర్తకమైనపుడు జీవిత వాస్తవాన్ని చిత్రించదు. కృత్రిమ అనుభూతులను సృష్టిస్తుంది. వాటికి మార్కెట్ లేకపోతే దాన్ని కూడ కృత్రిమంగా సృష్టిస్తుంది. గత ఇరవయ్యేళ్లలోను సాహిత్య వర్తకులైన పత్రికా సంపాదకులు సాధించిందదే".

..........................................................................................

..........................................................................................

..........................................................................................

..........................................................................................

..........................................................................................

..........................................................................................

..........................................................................................

..........................................................................................

### 6.4.5 ఆత్మీయతా శైలీ అనాసక్త శైలీ

మనం రాసే వచనంలో పాఠకుణ్ణి ఆత్మీయంగా భావించి, ప్రత్యక్షంగా సంబోధించినట్లు రాస్తే అది ఆత్మీయతా శైలి అవుతుంది. ఇది సాహిత్య శైలిలో భాగం అవుతుంది. ఈ శైలి పాఠకుడితో ప్రత్యక్షంగా సంభాషించినట్లే ఉంటుంది. గనుక నీవు, నేను వంటి సర్వనామాలుకూడా ఎక్కువగా కనిపిస్తాయి. అయితే ఇది సర్వనామాలకే పరిమితం కాదు. ఎన్నుకొనే పద, పదబంధ, వాక్యాల్లో కూడా ఈ భేదం కనిపిస్తుంది. కందుకూరి రాజ్యలక్ష్మమ్మ గురించి రాస్తూ దేవులపల్లి కృష్ణశాస్త్రి ఇట్లా అన్నారు:

"పోనీ ఇంకోలాగా అను. వాగర్థాలను విడదీయలేనట్లు వారినీ విడదీయలేము. గనుక ఇద్దరికీ కలిపి ఇస్తానను. నిజానికి ఏ మహాపురుషుడు ఉత్తమ మహిళా ప్రభావం లేకుండా లోకోత్తర కార్యాలు చేశాడయ్యా!"

ఈ పై పేరాలో **అను, అయ్యా** అనే సంబోధనలవల్ల ఈ ఆత్మీయతా గుణానికి ప్రాతిపదిక పడింది. పాఠకులను ప్రత్యక్షంగా సంబోధిస్తూ తనతో పాటు తీసుకొని పోయే ధోరణి ఈ శైలిలో కనిపిస్తుంది. ఇది కవితా ధోరణిలో భాగంగా గుర్తించటం తేలికే.

అనాసక్త (objective) వచనమంటే ఏ రకమైన అలంకారాలూ, ఆవేశమూ, ఉద్వేగమూ, ఆత్మీయతా లేకుండా, కవితా ధోరణికి లోనుగాకుండా కేవలం విషయ ప్రధానంగా రాసే వచనం. దీన్ని చాలామంది తెలుగు రచయితలు మెచ్చుకోరు. కారణం తెలుగులో విషయ ప్రధాన వచనం అవసరమైన శాస్త్ర రచనలు అధికంగా రాకపోవటం. శాస్త్రరచనలు అధికంగా ఉత్పత్తి అయ్యే పాశ్చాత్యభాషల్లో ఈ అనాసక్త శైలీ ధోరణి ప్రచురంగా అమల్లో ఉంది.

ఈ రకపు వచనంలో విషయ వివేచనే ప్రధానం. కవితాత్మక సాహిత్యవచనంలో కనిపించే ఉద్వేగమూ, ఆవేశమూ ఆత్మీయతా దీనిలో కనిపించవు. సాధారణంగా ఆయా శాస్త్రాల్లో నిష్ణాతులయిన వారికే ఉద్దేశించబడుతాయి గనుక ఈ రకపు వ్యాసాల్లో, సిద్ధాంత గ్రంథాల్లో విపులీకరణ తక్కువగానూ సంక్షిప్తత ఎక్కువగానూ ఉంటుంది. ఆయా శాస్త్రాల్లో అధిక పరిచయం లేనివారికి ఉద్దేశించి రాసే పుస్తకాల్లో, వ్యాసాల్లో విస్తరణశైలి కనిపించవచ్చు. ఒక్కోసారి సాహిత్యస్థాయికి ఎదిగిన వచనమూ కనిపించవచ్చు.

అనాసక్తమైన విషయప్రధాన రచనల్లో సాధారణంగా తార్కికధోరణి కనిపిస్తుంది. కార్యకారణ వివేచనా, చెప్పేవిషయానికి తగిన రుజువుల ప్రదర్శనా కనిపిస్తాయి. ఈ రచనల్లో 'ఇది ఇంతే', 'ఇదితప్పు', 'ఇదిరైటు', అనే పద్ధతిలో నిర్ధారణ ధోరణి కూడా కనిపించదు. శాస్త్రకారుడు తనకున్న ఆధారాలతో 'ఈ రకమైన నిర్ణయానికి వచ్చాను' అనే పద్ధతే కనిపిస్తుంది. ఉదాహరణకు నర్సులమీద రాసిన పరిశోధన వ్యాసం(తెలుగు వైజ్ఞానిక మాసపత్రిక. మార్చి 1987 పేరా 2) లో ఈ భాగం చూడండి.

"ఈ మూడు ఆసుపత్రులలోను పనిచేస్తున్న వందమంది నర్సుల సామాజిక ఆర్థిక పూర్వరంగాన్ని పరిశీలిస్తే వీరంతా ఆర్థికంగానూ, సామాజికంగానూ వెనకబడిన తరగతుల నుంచే వచ్చినవారని తెలుస్తుంది. ప్రధానంగా మూడు ఆస్పత్రులలోని శాంపిల్‌లో ఎక్కువ భాగం దారిద్ర్యరేఖ అడుగున నున్న కుటుంబాల నుంచి వచ్చినవారు. శాంపిల్‌లో దాదాపు 62 శాతం క్రిస్టియన్లు, 37 శాతం హిందువులు ఉండగా ముస్లిమ్‌లు కేవలం 2 శాతం మాత్రమే ఉన్నారు."

ఈ పై పేరాలో 'కవిత్వం' లేదు. చెప్పదలచిన విషయాన్ని సూటిగా, స్పష్టంగా చెప్పేధోరణి కనిపిస్తున్నది. చేస్తున్న ప్రతిపాదనకు ఆధారం చూపించే పద్ధతికూడా గమనించగలం. వచ్చిన నిర్ణయాలను 'ఇది ఇంతే, ఇంతకన్నా సత్యం ఉండదు' అని చెప్పేధోరణి కనపడదు.

"..... అని తెలుస్తున్నది, ..... పరిశీలనలో వెల్లడయింది" వంటి క్లాజులు రచయిత జాగ్రత్త (caution) ను సూచిస్తున్నాయి. వీటిల్లో సాధారణంగా 'నేను, నువ్వు' వంటి సర్వనామాలూ సంబోధనలూ ఉండవు.

**అభ్యాసాలు చేయండి 5**

i) ఈ కింది వచనంలో కవితా గుణాల్ని సూచించే లక్షణాల్ని గుర్తుపట్టండి.

"ఇంతలో ఒకాయన నా జీవితంలో ప్రవేశించాడు. చీకటింటి కిటికీలూ తలుపులూ తీసి వసంత కాలపు ప్రభాతవాయువులాగున. ఈయన ఎవరిద్వారా విన్నాడో నాసంగతీ, నారచనల సంగతీనీ. నాతో అనలేదు, నన్ను అడగలేదు."

..............................................................................................................

..............................................................................................................

..............................................................................................................

..............................................................................................................

..............................................................................................................

..............................................................................................................

ii) ఈ కింది పేరా ఏరకపు వచనమో సకారణంగా నిరూపించండి

"విభాజితమై ద్విగుణీకృతమయ్యే స్వభావంకల కణాలే శరీరంలోని అన్ని కణజాలాల్లో ఉంటాయి. ప్రౌఢ జీవిలో ఈ విభజన ద్విగుణీకృతత్వ ప్రక్రియ. కణాల జననం మరణం ఒకే పరిమితిలో ఉండేటట్లు నియంత్రిత మవుతుంటుంది. అయితే క్యాన్సరు వచ్చినపుడు. ఈ సమతూక నియంత్రణ ప్రక్రియ, శరీరంలో దెబ్బతింటుంది. దీనివల్ల ఆ కణజాలంలోని సాధారణ కణాల మరణాన్ని మించి క్యాన్సరు కణాలు వృద్ధి చెందేటంతగా అనియంత్రిత మవుతుంది"

..............................................................................................................

..............................................................................................................

..............................................................................................................

..............................................................................................................

..................................................................................................................

..................................................................................................................

..................................................................................................................

..................................................................................................................

..................................................................................................................

..................................................................................................................

### 6.4.6 గ్రాంథిక శైలి

ప్రాచీన కావ్యాల్లో మాదిరి వచనం కొద్ది మార్పులతో ఈ నాడుకూడా రాసేవారున్నారు. ఈ శైలిలో రాసేవారినిబట్టి అన్వయ క్లిష్టత పదాడంబరం ఉంటుంది. ఉదాహరణకు ఈ కింది వచన భాగాన్ని పరిశీలించండి:

పదములు శక్తములు. ఈ పదమునుండి ఈ యర్థము బోద్ధవ్యము అను నీశ్వర నంకల్పమునే శక్తి యందురు. అట్టి శక్తి కలవి శక్తములు ఇట్లనుట ప్రాచీన దార్శనిక సంప్రదాయము. లోకములో నొక్కక్క వస్తువున కొక్కొక్క ధర్మము నియతము. కాని నంస్కారాదుల వలనను, ఇతర వస్తుసమ్మేళనము వలనను ఆ వస్తు ధర్మము నన్యధాకరింవ వచ్చును." •

దీని భావాన్ని మామూలు తెలుగులో పెడితే ఇట్లా ఉంటుంది:
"ఒక్కోమాటకు ఒక్కోఅర్థం చెప్పే శక్తి ఉందని ప్రాచీన దార్శనికుల అభిప్రాయం. లోకంలో ఒక్కోవస్తువుకు ఒక గుణం నియతంగా ఉంటుంది. కాని కొన్ని మార్పులు చేయటం ద్వారాకాని, ఇతర వస్తులతో కలవటంవల్లకాని వేరే గుణాన్ని కల్పించవచ్చు."

ఎక్కువ మందికి అర్థమయ్యేట్టు రాయటానికి ఎక్కువ శ్రమ పడాలి. చాలామంది అంత ఓపిక లేకనో, పాండిత్య ప్రదర్శనకో ఇట్లా రాస్తుంటారు. "నాకిన్ని విషయాలు తెలుసు, నాకింత భాష వచ్చును" అని చూపించే ప్రయత్నాన్ని పాండిత్య ప్రదర్శన అంటారు.

రాను రాను ఈ రకమైన శైలిమీద మోజు తగ్గిపోతున్నది. సాధ్యమైనంతవరకు లోకంలో ప్రసిద్ధమైన మాటలనే వాడాలన్న అభిప్రాయం బలంగా వ్యాపిస్తున్నది.

రచనలో ఇంకా శైలీభేదాలు చాలా గుర్తించవచ్చు. ఇక ముందు వచ్చే పాఠాల్లో ఇవి, ఇంకా ఇట్లాంటి మరికొన్ని భేదాలను గుర్తించి వాడుకోవచ్చు. సందర్భాన్నిబట్టీ, ఉద్దేశించిన పాఠకులను బట్టీశైలీ భేదాలను వాడుకోవాలన్న సంగతి ఎప్పుడూ గుర్తుంచుకోవాలి.

### అభ్యాసాలు చేయండి 6

ఈ కింది వచనాన్ని సాధ్యమైనంత తేలిక పద్ధతిలో ఈనాటి వచనంలో రాయండి.

"ఇక వ్యవహార వేత్తృతయనునది పాఠకునకు మాత్రము వర్తించునదిగా దలవనగును. ఏలయన లోకశాస్త్ర కావ్యాద్యవేక్షణము వలన సిద్ధించిన నిపుణతకొక స్థాయి వచ్చిన తరవాతనే కవికి నత్కావ్య నిర్మాణ దక్షత యలవడునని యిత:పూర్వము చెప్పబడియున్నది."

..................................................................................................................

..................................................................................................................

..................................................................................................................

..................................................................................................................

..................................................................................................................

..................................................................................................................

..................................................................................................................

..................................................................................................................

## 6.5 ముఖ్య విషయాలను గుర్తుచేసుకొందాం

- రాసేభాషలో వస్తువును బట్టి, సందర్భాన్ని బట్టి, రాసేవాళ్ల అభిరుచినిబట్టీ శైలి భేదాలుంటాయి.
- భాషా స్వరూపంలో రచయిత ఎన్నుకున్న భేదాల సమూహాన్ని రచనా భాషలో శైలిగా నిర్వచించవచ్చు
- శైలీభేదాలు భాషాప్రయోగంలో వినుగుదలను పొగొడతాయి. ఆసక్తిని పెన్పరుస్తాయి
- ఒక విషయాన్ని చెప్పేటప్పుడు అవతలివాళ్లకు అర్థం కావటం కోసం బాగా విస్తరించి చెప్పటాన్ని విస్తరణశైలి అంటారు. క్లుప్తంగా చెప్పటాన్ని సంక్షిప్త శైలి అంటారు.
- చెప్పదలచుకున్న భావాన్ని సూటిగా, స్పష్టంగా చెప్పేది సాధారణశైలి. ఉద్వేగభరితంగా చెప్పేది ఉద్వేగశైలి.మనసుకు ఉల్లాసాన్నీ సంతోషాన్నీ ఉత్సాహాన్నీ కలిగించేశైలి కవితాత్మకశైలి. కవితాత్మకశైలిలో సాహిత్యస్థాయి అందుకున్న వచనం ఉంటుంది.
- విషయాన్ని నిర్మొహమాటంగా, సూటిగ్గా, చురుగ్గా స్పష్టంగా చెప్పే పద్ధతి శైలిలో సూటిదనానికీ పదునుకూ సంబంధించింది.
- పాఠకుణ్ణి ఆత్మీయంగా భావించి, ఎదురుగా నిలబడి పిలిచి మాట్లాడినట్లు రాసే పద్ధతి ఆత్మీయతాశైలి.ఏరకమైన అలంకారాలూ, ఉద్వేగమూ, ఆత్మీయతా లేకుండా కవితా ధోరణికిలోను కాకుండా విషయ వివేచన ప్రధానంగా రాసే విధానం అనాసక్తశైలి.
- ప్రాచీన కావ్యాల్లో మాదిరి పాండిత్య ప్రదర్శనకోసంచేసే రచనా పద్ధతి గ్రాంథికశైలి.
- మనంరాసే విషయాన్నిబట్టి, రాసే సందర్భాన్నిబట్టీ ఉద్దేశించిన పాఠకులను బట్టీ శైలి భేదాలను వాడుకోవాలి.

## 6.6 అభ్యాసాలకు మాదిరి జవాబులు

### అభ్యాసాలు చేయండి 1

i)మొదటి వాక్యంలో క్రియ గౌరవాన్ని సూచిస్తుంది. రెండవ వాక్యంలోని క్రియ సాంస్కృతిక పరమైన అర్థంలో కనిపిస్తుంది. మూడవ వాక్యంలో క్రియ సాధారణ అర్థంలో మాత్రమే ఉంది. నాలుగవ వాక్యంలో పోలిక కనిపిస్తుంది. ఈ పోలిక సాహిత్యశైలిని సూచించేది.

ii) భాషను ప్రయోగించే పద్ధతి చెప్పేవిషయాన్ని బట్టి వాడేదాన్నిబట్టి, సందర్భాన్నిబట్టి అభిరుచిని బట్టి వేరుగా ఉంటుంది. మాట్లాడే భాషలో మాండలిక భేదాలు కనిపిస్తాయి. రాసే భాషలో రచయిత తనకున్న భాషా సర్వస్వం నుంచి ఎన్నుకున్న భేదాల సమూహంశైలిగా రూపొందుతుంది. భాషా ప్రయోజనం విషయ నివేదనమే అయినప్పటికి నివేదించే పద్ధతులను బట్టి శైలీ భేదాలు ఏర్పడుతాయి.

### అభ్యాసాలు చేయండి 2

ఇచ్చిన సంభాషణలో ప్రశ్నలు తెలుగు నుడికారానికి అనుగుణంగా ఉన్నాయి. సమాధానాలు కర్మప్రధానవాక్యాలు. తెలుగుకు సహజంకానిది ఇది. అంతేకాదు ఇది సంభాషణ కాబట్టి సంభాషణలో ఈ రకమైన కర్మప్రధాన వాక్యాలను ఎవరూ మాట్లాడరు.

### అభ్యాసాలు చేయండి 3

ప్రశ్న కింద ఇచ్చిన వార్త కేవలం విషయ ప్రధానమయిన శైలిలో లేదు.అది జరిగిన సంఘటనపై రాసే వారి ఉద్వేగ మనస్థితిని తెల్పేశైలి. వాక్యాల్లో ఉపయోగించిన పదాలు - భీభత్సం, ఆర్తనాదాలు. గుబేలు మనిపించాయి. ఆవేశాన్ని వ్యక్తం చేసేవి. వాక్యాలు సాధారణ వచన స్థాయిని మించిన సాహిత్య స్థాయి వాక్యాలు "అర్ధరాత్రి నగరం నడిబొడ్డులోని మహిళా హాస్టలులో....." అంటూ సాగిన వాక్యం అనాసక్తంగా సాగిన వాక్యంకాదు. ఆవేశంతో సాగిన వాక్యం.

### అభ్యాసాలు చేయండి 4

దేవులపల్లి కృష్ణశాస్త్రి కందుకూరి రాజ్యలక్ష్మమ్మ మీద రాసిన వ్యాసం సాహిత్యవచనశైలికి సంబంధించింది. ఈ శైలిలో ఆవేశ ప్రకటనమూ, శబ్దదృష్టీ, ఆత్మీయతా ప్రధానంగా కనిపిస్తాయి. అలంకారదృష్టి సైతం కనిపిస్తుంది. పదప్రయోగంలో కాల్పనికత చోటు చేసుకొంది. హేమంత నిశీధం వాసంత ప్రభాతం, శుభ్రసుందరం కాల్పనిక భావాన్ని తెలిపే పదాలు అట్లాగే శబ్ద

సామ్యమున్న పదాలను ఉపయోగించటం కూడా మనం ఈ శైలిలో చూడవచ్చు : ''వెలుగుంటే, స్వచ్ఛతఉంటే విశ్వాసముంటే, కపోలాలలో, స్విన్న నేత్రాలలో'

**అభ్యాసాలు చేయండి 5 .**

i) ఇచ్చిన వచనం సాహిత్య వచనం. ఈ వచనశైలి కవిత్వభాషకు సన్నిహితంగా ఉంది. జీవితంలో ప్రవేశించాడు అనే విషయంతో చీకటింటి కిటికిలో తలుపులూ తీసి వసంతకాలపు ప్రభాతవాయువులాగా అనే పోలిక కవిత్వ భాషకు సన్నిహితమైంది. ఈ శైలిలో అవాస్తకతలేదు. ఆత్మీయతా గుణమే ఉంది. అయితే ఉత్తమ పురుష నామవాచకాలను వాడటం వల్ల ఇది కొంత రచయిత ఆత్మప్రకర్షను తెలియజేస్తుంది.

ii) పేరాలో ఉన్న విషయం : విషయప్రధాన శైలికి సంబంధించింది. శాస్త్రవిజ్ఞాన విషయాన్ని అనాసక్తంగా చెప్పే ధోరణి ఇందులో ఉంది. శాస్త్ర విషయాలను చెప్పేటప్పుడు సాధారణంగావాడే పరిభాషను ఈ పేరాలో చూడవచ్చు. ఈ పరిభాష రెండు రకాలు : 1. కొత్త భావాలకు తెలుగులో కొత్త మాటలను కల్పించటం. ఉదాహరణకు - కణజాలాలు, ప్రౌఢజీవి, ప్రక్రియ, నియంత్రితం, సమతూకనియంత్రణ ప్రక్రియ. 2. ఇంగ్లీషు మాటల వాడకం, మిశ్రసమాసాల వాడకం కూడా ఈ శైలిలో కనిపిస్తుంది. : కాన్సరు, కాన్సరుకణాలు.

**అభ్యాసాలు చేయండి 6**

వ్యవహారనేతృత్వం అనేది పాఠకునికి మాత్రమే వర్తిస్తుంది. ఎందుకంటే లోకాన్ని శాస్త్రాలను, కావ్యాలను మొదలైన వాటిని పరిశీలించిన తరువాత కవి నిపుణతకు ఒక స్థాయి వస్తుంది. ఆ తరువాతనే మంచి కావ్యాలు రాసే శక్తి అలవడుతుంది.